ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 34.0
కనిష్ఠం: 19.0

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు

సోమవారం 12 ఫిబ్రవరి 2024



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వాసవీమాతకు నీరాజనం

పెనుగొండ, ఫిబ్రవరి 11 : అఖిల భారత్ శ్రీ వాసవి పెనుగొండ ఆలయంలో ఆదివారం వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం, పంచమ వార్షికోత్సవ మహోత్సవాలను ఆదివారం ఉదయం వేడుకగా ప్రారంభించారు. ఈ మహోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి 500 మంది దీక్షాధారులచే వాసవి అగ్ని ప్రవేశం కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. 102 గోత్రికుల హోమాలను ఆలయ ప్రధాన అర్చకులు శిష్టా మణికంఠ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 102 గోత్రాలతో అమ్మవారికి రజత మాల సమర్పించారు. విశ్వరూప దర్శనం దీక్షా విరమణ ప్రత్యేక హోమాలు చేశారు. శోభాయాత్ర నిర్వహించారు. మువ్వ గోపాల కల్చరల్ అకాడమి విజయవాడ వారిచే 'శ్రీ వాసవి నృత్య నీరాజనమ్' నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో శ్రీ వాసవి మాతకు ప్రత్యేక అష్టాదశ హారతులు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 250 మందిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.



శోభాయాత్రలో భక్తులు



ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొల్లేరులో.. క్యాట్ ఫిష్!



కొల్లేరు మధ్యలో వేసిన టెంట్

- నిబంధనలకు తిలోదకాలు
- అభయారణ్యంలో దర్జాగా రోడ్డు
- సొంత చెరువులా సరస్సులో వలలు
- ప్రత్యేకంగా 20 మంది నియామకం
- జోరుగా పలు హోటళ్లకు అక్రమ రవాణా
- అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి బరితెగింపు
- చర్యలు తీసుకునే ధైర్యం చేయని అటవీశాఖ అధికారులు

దెందులూరు, ఫిబ్రవరి 11 : వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి కొల్లేరు సరస్సు చిక్కిశల్యమవుతోంది. యథేచ్ఛగా అనధికార చెరువుల తవ్వకాలతో కొంతమంది అక్రమార్కులు సొమ్ములు చేసుకుంటున్నారు. గతంలో కొల్లేరులో వెనుకబడిన దళిత, పేద మత్స్యకారుల కుటుంబాలు చేపలు పట్టుకుని వాటిని అమ్ముకుని జీవనం సాగించేవి. ప్రభుత్వం మారడంతో వారి తలరాతలు మారాయి. పొట్టకూటి కోసం చేపలు పట్టుకునేందుకు కొల్లేరులో అడుగు పెట్టలేని పరిస్థితి నేడు నెలకొంది. లక్ష్మీపురం, కేతవరం, పోతునూరు, ఆగడాలలంక, చెట్టున్నపాడు తదితర గ్రామాల పరిధిలోని నడి కొల్లేరులో ఏకంగా రోడ్డు వేసి అధికార పార్టీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి దర్జాగా క్యాట్‌ఫిష్ పెంపకంతో పాటు కొల్లేరులోని చేపలను అక్రమంగా పట్టి అమ్ముతూ లక్షలు సొమ్ము చేసుకుంటున్నాడు. ప్రజల ప్రాణాలకు ముప్పని తెలిసి క్యాట్‌ఫిష్ పెంపకాన్ని ప్రభుత్వం నిషేధించినా నిబంధనలు ఉల్లంఘించి మరీ దందా సాగిస్తున్నాడు. దీనికోసం పోతునూరు నుంచి ఆరు కిలోమీటర్ల లోపల నడి కొల్లేరు అభయారణ్యంలో రోడ్డు వేసి 20 మందిని నియమించి, టెంట్‌లు వేసి సొంత చెరువు మాదిరిగా వలలు ఏర్పాటు చేయడం గమనార్హం. కొర్రమీను, మట్టగురస చేపలు కేజీ రూ.500 వరకు డిమాండ్ ఉంది. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లోని కొంతమంది హోటల్ యజమానులు వాటిని కొనుగోలు చేయకుండా వాటిని పోలి ఉండే క్యాట్‌ఫిష్‌ల వైపునకు మొగ్గు చూపుతున్నారు. దీంతో కేజీ రూ.200 చొప్పున ఆయా హోటళ్ల యాజమానులకు విక్రయిస్తూ ఆ నాయకుడు సొమ్ము చేసుకుంటున్నాడు. వలతో కొల్లేరులో అన్ని రకాల చేపలను పట్టి ఇబ్బందులు లేని తినే చేపలను పగలు బయటకు తరలిస్తూ నిషేధిత చేపలను మాత్రం వల కట్టి మడుగులో దాచి రాత్రి 11 గంటలు దాటిన తర్వాత హోటళ్లకు చేరవేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికార పార్టీ నాయకుడు కావడంతో అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకునేందుకు ధైర్యం చేయడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొల్లేరును పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.





నిషేధిత క్యాట్ ఫిష్ ఉంచిన వల..



పోతునూరు నుంచి నిషేధిత నడి కొల్లేరుకు వేసిన మట్టి రోడ్డు

14 నుంచి ఉద్యోగుల ఉద్యమ శంఖారావం



జేఏసీ రాష్ట్ర సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీనివాస్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 : ఆర్థిక బకాయిల చెల్లింపుపై రాష్ట్రప్రభుత్వ దాటవేత ధోరణిని నిరసిస్తూ 'ఉద్యమ శంఖారావం' పేరిట ప్రత్యక్ష పోరాటానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జేఏసీ మరోసారి సిద్ధమైంది. ఆదివారం విజయవాడలో అన్ని జిల్లాల జేఏసీ నాయకులతో నిర్వహించిన రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం వివరాలను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జేఏసీ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్ ఏలూరులో మీడియాకు వివరించారు. సరెండర్ లీవులు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, వైద్యఖర్చుల బిల్లుల రీయింబర్స్‌మెంట్, పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవుల కు చెల్లింపులు, గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దుకింద జీతాలు, జలవనరులశాఖలో అవుట్‌సోర్సింగ్ లస్కర్లకు ఏపీ ఆప్కాస్ ద్వారా 12 నెలల జీతాల బకాయిలు, డీఏ బకాయిలు, 11వ పీఆర్సీలో చెల్లించాల్సిన బకాయిలను ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని సమావేశంలో జేఏసీ నాయకులు డిమాండ్ చేశారని వివరించారు. ఈ డిమాండ్ల సాధనకు జేఏసీ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించిన ఉద్యమ శంఖారావానికి పూర్తి మద్దతునివ్వాలని అన్ని జిల్లాల ఉద్యోగ సంఘాల నాయకులు నిర్ణయించారని తెలిపారు.

27న చలో విజయవాడ

ఉద్యమ శంఖారావం దశలవారీ పోరాట కార్యక్రమాల వివరాల ను ఏపీ జేఏసీ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్ తెలిపారు. ఈనెల 14న ఉమ్మడి జిల్లాలోని అన్ని తాలూకాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, తహసీల్దార్/సబ్ కలెక్టర్/కలెక్టర్లకు డిమాండ్లను పరిష్కరించాల్సిందిగా ప్రాతినిధ్యం చేస్తారు. 17న తాలూకా/జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, ధర్నా ఉంటాయి. 15, 16 తేదీల్లో భోజన విరామ సమయాల్లో తాలూకా/ పాఠశాలల్లో నిరసన ప్రదర్శనలు, 20న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ర్యాలీ, ధర్నా నిర్వహిస్తారు. 27న చలో విజయవాడ ఉద్యమాన్ని నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ ఐక్య కార్యాచరణ సమితి తీర్మానించిందని వివరించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 220 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 : జిల్లాలో ఆదివారం జరిగిన ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం 5,405 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 5,185 మంది హాజరయ్యారని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

ఇంటింటికీ రాదు.. వీధి చివరే రేషన్!



ఏలూరులో ఎమ్డీయూ వాహనం వద్దకు వెళ్లి రేషన్ తీసుకుంటున్న కార్డుదారులు

- 15 కార్డుదారులకు ఒకేచోట రేషన్ పంపిణీ
- వలంటీర్ల సమక్షం తప్పనిసరి
- కొత్త విధానాన్ని వ్యతిరేకిస్తున్న వాహన నిర్వాహకులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 11 : నెలవారీ రేషన్ సరుకులను కారుదారుల ఇళ్ల ముంగిటనే అందజేస్తానని చెబుతూ ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్రవేశపెట్టిన డోర్ డెలివరీ పథకం పూర్తిగా నీరు కారింది. పథకం అమలు దగ్గర నుంచి ఏ ఒక్క గుమ్మం ముందు సరుకులు అందజేసిన దాఖలాలు లేవు. అనుకున్న విధంగా డోర్ డెలివరీ చేపట్టాలని చేసిన ప్రయత్నాలు అన్ని వమ్ముకావడంతో ఇక గత్యంతరం లేని పరిస్థితుల్లో చివరికి వీధి డెలివరీకి అధికారికంగానే అనుమతి ఇచ్చేందుకు అన్ని రకాల కసరత్తులు పూర్తిచేసి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఒకచోట, పట్టణ ప్రాంతాల్లో 4,5 వీధులు కలిసే కూడళ్ల వద్ద సరుకులు పంపిణీ జరుగుతోంది. వలంటీర్ల సమక్షంలో సరుకులు పంపిణీ జరగాలని, ప్రారంభంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులూ అమలుకు నోచుకోలేదు. ఈ పథకం పూర్తిగా అభాసు పాలైందని గ్రహించిన ప్రభుత్వం కనీసం వీధి డెలివరీ చేసి సజావుగా పంపిణీ జరిపించాలనే యోచనతో కొత్త విధానానికి సిద్ధమైంది.

చివరికి వీధి డెలివరీకి మొగ్గు

డోర్ డెలివరీ విధానం అభాసుపాలు కావడంతో వీధి డెలివరీ విధానమైనా సజావుగా చేయాలని ప్రస్తుత ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. అంత్యోదయ కార్డులు కలుపుకుని జిల్లాలో 5,02,803 రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తం 5,060మంది వలంటీర్లు ఉన్నారు. డెలివరీ ఎలా చేస్తారంటే జిల్లాలో ఒక్కో వలంటీర్ పరిధిలో 50 నుంచి 75 రేషన్ కార్డులు ఉన్నాయి. వీధుల్లో ఎక్కడెక్కడ రేషన్ పంపిణీ చేయాలో వలంటీర్లు గుర్తించాల్సి ఉంది. వలంటీర్లు ఐదు నుంచి 8 స్థలాలను గుర్తించాల్సిందిగా ఆదేశించారు. ప్రతినెల పంపిణీ చేసే ప్రత్యేక స్థలాన్ని జీపీఎస్ ద్వారా లోకేట్ చేసి ఉంచాలి. ఈ లోకేషన్ పరిధిలోకి వచ్చే 10 లేక 15 రేషన్ కార్డులను ఈ లోకేషన్‌కు మ్యాపింగ్ చేయాలి. ఇవన్నీ సజావుగా పూర్తయిన తర్వాత సరుకుల డెలివరీ కోసం సరిగ్గా జి.పి.ఎస్ ద్వారా నిర్ధారించిన స్థలం వద్దే వాహనాన్ని ఉంచి దాన్ని మ్యాపింగ్‌లో ఉన్న కార్డులకు వలంటీర్ వాహనం వద్దే ఉండి పంపిణీ చేయాలి. లోకేషన్‌తో పాటు రుజువుగా ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. ఏ రోజు వాహనం ఆ లోకేషన్‌కు వస్తుంది. ఎన్ని కార్డులకు డెలివరీ చేయా లి, స్థలం, వివరాలను వీధి డెలివరీ కోసం వలంటీర్లు సిద్ధం చేసి ఉంటా రు. ఈ తతాంగం అంతా గతేడాదే జరగాల్సి ఉన్నా వలంటీర్లు నిరాసక్తత కారణంగా ఆలస్యమైంది.

వ్యతిరేకిస్తున్న ఎమ్డీయూ వాహనదారులు

ఇంతా చేస్తే చివరకు వీధిడెలివరీ విధానం క్రమబద్ధీకరణకు ఎమ్డీయూ వాహనాల నిర్వాహకులు వ్యతిరేకిస్తున్నారు. వలంటీర్లు గుర్తించిన చోట డెలివరీ చేయడం సాధ్యం కాదనేది వీరి వాదన. ప్రతి 15 కార్డులు పంపిణీ తర్వాత మరోచోటికి వాహనాన్ని మార్చాలంటే ఎలక్ట్రానిక్ తూచే యంత్రాలను సర్ది మళ్లీ కొత్తచోట అమర్చాలంటే సమయం వృథా అవుతుందని, కొన్నిసార్లు సిగ్నల్స్ అందవని వీరు చెప్తున్నారు. ఇక వలంటీర్ల సమక్షంలో వారి వీలును బట్టి పంపిణీ చేయడం కూడా కుదరదని స్పష్టం చేస్తు న్నారు. ఈ స్థితిలో వీధి డెలివరీ విధానం అసలు జరిగే పనికాదని, వాహనదారులు ప్రారంభంలోనే చేతులెత్తేస్తున్నారు. ఈ దశలో డోర్ డెలివరీ కాదుకదా కనీసం వీధి డెలివరీ కూడా ఎలా చేయాలో పాలుపోవడం లేదని అధికారులు వాపోతున్నారు.

ఈ నగరానికి.. ఏమైంది..?





- నగరంలో అల్లరి మూకల జోరు
- అదుపు తప్పుతున్న శాంతి భద్రతలు
- నంబర్‌లేని బైక్‌లతో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా చక్కెర్లు
- పెరుగుతున్న ఈవ్ టీజింగ్
- నగరంలో తెల్లవార్లు తెరిచే ఉంటున్న హోటళ్లు, కిళ్లీషాపులు
- కానరాని బ్లూకోల్ట్స్, రక్షక్ వాహనాలు
- పోలీసు నిఘా వైఫల్యంపై నగరవాసుల విమర్శలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలోనే పట్టపగలు అల్లరిమూకల జోరు పెరిగిపోయింది. వీరి ఆగడాలు ఇటీవల పెచ్చుమీరాయి. ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేయడంతో ఆ మూకలకు హద్దే లేకుండా పోయింది. పోలీసులు నిఘా పెట్టడంలో వారిని అదుపు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారని నగర వాసులు విమర్శిస్తున్నారు. నగరంలోని తంగెళ్ళమూడి, కొత్త పేట, నూకాలమ్మగుడి ప్రాంతం, ఆర్ఆర్‌పేట, వత్తేబాద, కండ్రికగూడెం సెంటర్, ఎస్ఆర్‌పేట, కొత్తగూడెం సెంటర్, చిరంజీవి బస్టాప్ ఏరియా, వంగాయగూడెం సెంటర్, నగరంలోని వివిధ ప్రధాన కూడళ్లల్లో ఆకతాయిల జోరు పెరిగింది. రెండు రోజుల క్రితమే ఒక యువకుడు మద్యం మత్తుతో మోటారు సైకిల్ నడిపి రోడ్డుపై మహిళలను భయభ్రాంతులకు గురిచేయగా ప్రశ్నించిన మహిళపై దాడి చేశాడు. నగరంలో కొంతమంది బైక్‌లకు నెంబర్ ప్లేట్లు లేకుండానే విచ్చలవిడిగా చక్కెరలు కొడుతూ సైలెన్సర్లతో విపరీతమైన శబ్దాలు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఉన్నప్పటికి వారు దృష్టి పెట్టకపోవడంతో వీరి చేష్టలు శృతిమించుతున్నాయి. పగటిపూట కాలేజీ ప్రాంతాల్లో నెంబర్ లేని మోటారు సైకిళ్లపై వచ్చి ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారు. గతంలో బ్లూకోల్ట్స్ వాహనాలు, రక్షక్ పోలీసు వాహనాలు ఉండేవి. ఇలాంటి ఆకతాయిల పనిపట్టడానికి ఈ వాహన సిబ్బంది క్షణాల్లో ఘటనాస్థలికి చేరుకుని వారి ఆట కట్టించేవారు. కొన్ని కాలేజీల వద్ద మఫ్టీలో ఉండి ఆకస్మికంగా ఆకతాయిలను పట్టుకునే వారు. ప్రస్తుతం పోలీసులు ఏ కాలేజీల దగ్గరకాని ఏ ప్రధాన సెంటర్లలో కాని నిఘా పెట్టకపోవడంతో ఆకతాయిల జోరు పెరిగింది. ఇటీవల వాహనాల తనిఖీలు లేకపోవడంతో అల్లరిమూకల జోరు మరింత పెరిగింది. వివిధ బందోబస్తుల కారణంగా పోలీసులు వేరే విధుల్లో ఉండడంతో తనిఖీలు చేయకపోవడమే ఆసరాగా తీసుకున్న అల్లరి మూకలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో గంజాయి విక్రయాలు జోరుగా జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. శివారు ప్రాంతాల్లో రహస్యంగా గంజాయి దందా సాగుతున్నట్టు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో యువకులు గంజాయి మత్తులో జోగుతూ కన్పిస్తున్నారు.

రోడ్లపైనే మద్యపానం..

ఎక్కడపడితే అక్కడ రోడ్డుపైనే మద్యం తాగుతున్నా ఎవ్వరు పట్టించుకోకపోవడంతో మహిళలు, యువతులు బిక్కుబిక్కుమంటూ భయంతో వెళ్లాల్సి వస్తోంది. కొన్ని సెంటర్లలో అయితే తాగుబోతులు ఒంటరిగా వెళ్లేవారిని ఆపి తమకు డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్నారు. కొన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సిబ్బంది చూసీ చూడనట్టు వ్యవహరించడంతో 24 గంటలు అందుబాటులో కొన్ని కిళ్లీ షాపుల వద్ద మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో మందుబాబులు అర్ధరాత్రుళ్లు కూడా మద్యం తాగుతూ విచ్చలవిడిగా నగరంలో చక్కెరలు కొడుతున్నారు. నగరంలో షాపులు రాత్రి 10 గంటలకు మూసి వేయాల్సి ఉన్నా కొన్ని హోటళ్ళు, కిళ్లీ షాపులు తెల్లవార్లు తెరచే ఉంటున్నాయి. దీంతో అల్లరి మూకలకు కావాల్సిన పదార్థాలు, వస్తువులు అందుబాటులో ఉన్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న ఎన్నికల సమ యానికి అల్లరి మూకల జోరు మరింత పెచ్చుమీరి శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని నగరవాసులు భయాందోళన చెందుతున్నారు.

తాటాకు పందిరే దిక్కు..!



తాటాకు పందిరి వద్ద విధులు నిర్వహిస్తున్న కమర్షియల్ టాక్స్ సిబ్బంది

- సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సమస్యల తిష్ఠ
- మంచినీళ్లకూ కటకట
- కరెంట్ పోతే చీకటిలో మగ్గాల్సిందే..
- వేధిస్తున్న విష పురుగుల బెడద
- భయాందోళనలో సిబ్బంది విధుల నిర్వహణ

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 11 : తాటియాకులగూడెం వద్ద ఉన్న రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కరోనా సమయంలో 2020-21లో పోలవరం సీఐ, ఒక హెడ్ కానిస్టేబుల్ చొరవతో స్థానిక పెద్దల సహకారంతో అప్పటి పోలవరం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో ఈ చెక్‌పోస్టును ప్రారంభించారు. దీంతోపాటు మండలంలో ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన కామయ్యపాలెం, రాచన్నగూడెంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కంటెనర్లు పాడయ్యాయి. 24 గంటల పాటు పనిచేసేందుకు సిబ్బంది కొరత ఉండడం, గతంలో సచివాలయం ద్వారా పనిచేసిన ఎస్పీవోలను తొలగించారు. ప్రస్తుతం ఎస్ఈబీ పోలీస్ శాఖల ద్వారా మొబైల్ చెకింగ్ నిర్వహిస్తున్నారు. జీలుగుమిల్లి సరిహద్దు ప్రధాన చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ, పోలీస్, ఏఆర్ సిబ్బంది, కమర్షియల్ టాక్స్, ఆర్టీవో శాఖల అధికారులు విధులు నిర్వహించేందుకు సరైన సౌకర్యాలు లేక చెట్ల నీడలో, కర్రలతో తాటాకుల పందిరి ఏర్పాటు చేసుకుని విధులు నిర్వహించాల్సి వస్తోంది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు సరైన సదుపాయాలు లేవు. ఉన్న ఒక్క మరుగుదొడ్డి అంతంత మాత్రంగానే ఉంది. తాగునీటి సదుపాయం, విద్యుత్తు సరఫరా నిలిచిన సమయంలో ఇన్వర్టర్ లేక సమస్యలు ఎదురవుతున్నాయి. రాత్రి సమయాల్లో చుట్టూ పొలాలు, మన్యం ప్రాంతం కావడంతో విష సర్పాల బెడద ఎక్కువగా ఉంటోందని సిబ్బంది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళా సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహించాలంటే నిరాసక్తత చూపుతున్నారు. గంజాయి, మద్యం, ఇతర అక్రమ రవాణా జరగకుండా రెండు తెలుగు రాష్ట్రాలకు రాక పోకలు సాగించే వాహనా లను నిత్యం ఇక్కడ తనిఖీలు చేస్తున్నారు. ప్రస్తు తం ప్రభుత్వం వీటి నిర్వహణ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి వేసవి దృష్ట్యా తగిన సదుపాయాలు కల్పించాలని విధులు నిర్వహించే సిబ్బంది కోరుతున్నారు.



గతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు గది ద్వారం ఊడిపోయి కన్పిస్తున్న వైనం



చెక్‌పోస్టు వద్ద అధికారులకు కోసం ఏర్పాటు చేసిన ఒక్కటే ఇరుకు మరుగుదొడ్డి


భీమడోలు జంక్షన్‌లో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ధర్మరాజు, తదితరులు

పవన్ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

భీమడోలు, ఫిబ్రవరి 11 : త్వరలో భీమడోలు, గణపవరం ప్రాంతాల్లో జరిగే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బహిరంగ సభ ఏర్పాట్లకు భీమడోలు జంక్షన్‌లోని సభాప్రాంగాణాన్ని జనసేన నేతలు ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా జోన్-2 కో-కన్వీనర్ చిక్కాల వేణు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు తోట పవన్, అనిల్ కుమార్, ఉంగుటూరు ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు, భీమడోలు మండల అధ్యక్షుడు ప్రత్తి మదన్ తదితరులు పాల్గొన్నారు.

'చెస్‌తో చిన్నారుల్లో మేధాశక్తి పెంపు'

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 11: చెస్ క్రీడ వల్ల చిన్నారులలో మేధాశక్తి పెరుగుతుందని నరసాపురం పార్లమెంటు వైసీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల అన్నారు. భీమవరంలో జరిగిన గ్రంధి వెంకటేశ్వరరావు స్మారక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ చదరంగ పోటీల విజేతలకు లక్ష రూపాయల నగదును గూడూరి ఉమాబాల చేతుల మీదుగా అందించారు. ఈ పోటీలలో 20 జిల్లాల నుంచి సుమారు 167 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి బహుమతి కోనసీమ జిల్లాకు చెందిన సింహాద్రి సాయి రుషికేష్, రెండో విన్నర్‌గా తూర్పుగోదావరి జిల్లా భార్గవ్ సుశాంత్ సాకేత్, మూడో విజేతగా తూర్పుగోదావరి జిల్లా టీవీఎస్ కావ్యశ్రీ, నాలుగో విజేతగా కోనసీమ జిల్లా డి.సాత్విక్, ఐదో విన్నర్‌గా తుర్పుగోదావరి చెందిన కె.సీతాసాగర్, ఆరో విజేతగా గుంటూరు జిల్లా ఎ.నాగశివసాయి దివ్య, ఏడో విజేతగా కోనసీమ జిల్లా కె.రాజేశ్, ఎనిమిదో విజేతగా ఎన్టీఆర్ జిల్లా ఎస్.ప్రీతమ్, తొమ్మిదో విజేతగా గుంటూరు జిల్లా టి.నాగఉదయ్‌అనురాగ్, పదో స్థానంలో గుంటూరు జిల్లా టి.శ్రీలాస్య విజేతలుగా నిలిచారు. వీరికి లక్ష రూపాయల నగదు అందించినట్టు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. బహుమతుల ప్రదాన కార్యక్రమంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ, చెస్ అసోసియేషన్ సభ్యులు తోట బోగయ్య, ఎస్.భీమారావు, తోట హరిబాబు, ఎం.మురళి పాల్గొన్నారు.


చెస్ విజేతలకు బహుమతులు అందిస్తున్న గూడూరి ఉమాబాల, గ్రంధి రవితేజ

నేడు ఉద్యోగుల సమస్యలపై జేఎస్‌సీ సమావేశం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఈనెల 12న మధ్యాహ్నం 3.30 గంటలకు ఏపీ సెక్రటేరియట్‌లో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్(జేఎస్‌సీ) సభ్య సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం నుంచి సమాచారం అందిందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పాతపెన్షన్ విధానం అమలు, సీపీఎస్/జీపీఎస్‌ల స్థానే ఓపీఎస్, 12వ పీఆర్సీ అమల్లోపు 30 శాతం మధ్యంతరభృతి (ఐఆర్), ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) లోపాలు, డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌లో ఉపాధ్యాయ పోస్టుల పెంపుదల, హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్ విద్యను బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ఇంక్రిమెంట్ల మంజూరు, చిన్నపాటి తప్పులకు కూడా టీచర్లను సస్పెండ్ చేస్తామని విద్యాధికారుల బెదిరింపులు, టీచర్లను సమాజంలో చులకనచేసేలా అధికారులు వ్యవహరిస్తుండటం తదితర అంశాలను సమావేశంలో లేవనెత్తుతామని వివరించారు.

త్రిమూర్తి స్వరూపుడు విద్యారణ్య మహర్షి

▸ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 11 : విద్యారణ్య అంటే అరణ్యం వంటి జ్ఞానం కలవారని అర్థం అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు అన్నారు. భీమవరం స్థానిక ఆనంద ఫంక్షన్ హాలులో మూడు రోజులుగా జరుగుతున్న గరికిపాటి వారి 'విద్యా ఆరణ్య మహర్షి విరచిత ప్రవచనాలు' ముగింపు సభలో ఆదివారం ఆయన మాట్లాడారు. విద్యారణ్య మహర్షి 1331లో సన్యాసం స్వీకరించిరి. శృంగేరి పీఠంనకు శంకరాచార్యుని తరువాత ఐదు దశాబ్దాల తరువాత పీఠాధిపతి అయ్యారని, గొప్ప విద్వాంసులు, గొప్పయోగి అని శంకరాచార్యులు తరువాత మళ్లీ శంకరాచార్యులు అంతటి వారనిపించుకున్నారన్నారు. విద్యారణ్య స్వామి 1386లో శివైక్యం చెందారని తెలిసి చింతించి వారి పేరున ఒక అగ్రహారానికి విద్యారణ్యపురం అని పేరు పెట్టారని, విద్యారణ్య మహర్షి ఒక బ్రహ్మగా, విష్ణువుగా, శివుడుగా హరిహర బుక్కరాయులు వర్ణించారని, ధర్మాన్ని రక్షించే మహాత్ములు అని మహర్షి చెప్పినట్టు గుర్తు చేశారు. తొలుత గరికిపాటి నరసింహారావు ఫౌండేషన్ ఛైర్మన్ యూకే విశ్వనాథరాజు, కంతేటి వెంకటరాజు, బొమ్మిడి నారాయణరావు, చంద్రజీ జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం పద్మశ్రీ గరికిపాటి నరసింహారావును సత్కరించారు, సభలో ఆనందరాజు కుటుంబ సభ్యులు జోగి రాజు, రామభద్రరాజు, ధార్మిక పరిషత్ సభ్యులు రామ్‌కుమార్‌రాజు, రంగరాజు లక్ష్మణ వర్మతో పాటు పురప్రముఖులు పాల్గొన్నారు


ప్రవచనాలు చెబుతున్న గరికిపాటి నరసింహారావు

యజమాని కొట్టాడని బాలుడి అదృశ్యం

▸ ఆచూకీ తెలుసుకున్న పోలీసులు.. తల్లికి అప్పగింత

▸ గాయాలుండడంతో ఆసుపత్రికి తరలింపు.. ఎమ్మెల్సీగా నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11 : యజమాని కొట్టడంతో ఒక బాలుడు మనస్తాపానికి గురై వెళ్లిపోయాడు. చివరకు పోలీసులు ఆ బాలుడు అదృశ్యం అయ్యాడని కేసు నమోదు చేసి తీసుకువచ్చి తల్లికి అప్పగించారు. ఆ బాలుడు ఏ కారణము చేత వెళ్లాడో చెప్పడంతో అవాక్కయ్యారు. ఆ బాలుడికి గాయాలు ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి ఆదివారం రాత్రి తీసుకువచ్చి వైద్యులచే పరీక్షలు చేయించి ఎమ్మెల్సీగా నమోదు చేయించారు. ద్వారకాతిరుమలలోని తూర్పువీధినకు చెందిన వీరవరపు శివ(16) 9వ తరగతి వరకు చదివి కొంతకాలం నుంచి ద్వారకాతిరుమల పరిధిలోని మండపాలకు పూల డెకొరేషన్ చేసే కాంట్రాక్టర్ గువ్వల నాగబాబు వద్ద పని చేస్తున్నాడు. శివ తండ్రి మరణించడంతో తల్లి చంద్రావతి వద్ద ఉంటున్నాడు. నాగబాబు అతడి భార్య మధ్య మనస్పర్ధలు రావడంతో అందుకు కారణం శివే అని భావించి ఈనెల ఒకటిన కొట్టాడని, మళ్లీ 9వ తేదీన కొట్టాడని మనస్తాపానికి గురై తాను పాలకొల్లు మండలం తిల్లపూడి గ్రామంలో ఉన్న నితిన్ వద్దకు వెళ్లానని పేర్కొన్నారు. అతడికి గాయాలు ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి ఎమ్మెల్సీగా నమోదు చేశారు. నాగబాబుకు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉందని ఆ విషయం శివకు తెలియడం వల్ల తన భార్యకు చెప్పి ఉంటాడని అనుమానంతో కొట్టినట్టుగా చెబుతున్నారు. ఆసుపత్రి వైద్యులు ఇచ్చిన ఎమ్మెల్సీతో ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులు అతడి నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ సంఘటనపై ద్వారకాతిరుమల పోలీసులు విచారణ చేపట్టారు.

వేర్వేరుచోట్ల ఆరుగురు జూదరుల అరెస్ట్

టినరసాపురం/ఆకివీడు, ఫిబ్రవరి 11 :టి.నరసాపురంలో పేకాట ఆడుతు న్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ డి.దుర్గామ హేశ్వర రావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి.. టినరసాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి మూడు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఆకివీడు మండలం దుంపగడప పోతురాజుకాలనీలో పేకాటాడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ బత్తి న నాగబాబు ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

ఉండి, ఫిబ్రవరి 11 :భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉండి పోలీస్‌స్టేషన్ రైటర్ యేసయ్య తెలిపారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి భవానీపేటకు చెందిన మర్రి ప్రసాద్ భార్య మర్రి ఝాన్సీ భర్తపై కోపంతో పెద్దకుమారుడిని ఇంటి వద్ద విడిచిపెట్టి ఎనిమిది నెలల చిన్నకుమారుడుని తీసుకుని వెళ్లిపోయింది. రెండురోజుల పాటు బంధువులు ఇంటి వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికి కనిపించ లేదు. భర్త ప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

ఏలూరు జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రమైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నెలకొన్న ద్వారకాతిరుమల గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గ్రామం చెత్తాచెదారంతో నిండి అపారిశుధ్యం తాండవిస్తుంది. ఇదెక్కడి దారుణం అంటూ అటు స్థానికులు ఇటు క్షేత్రానికి వచ్చిన భక్తులు విమర్శిస్తున్నారు. శ్రీవారు కొలువైన క్షేత్రంలో రహదారులు అధ్వానంగా ఉండడంతో భక్తులు అసహ్యించుకుంటున్నారు.

- ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమలలో పారిశుధ్యం అధ్వానం

▸ పంచాయతీ అధికారుల తీరుపై కానరాని విచారణ

▸ ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు రాని వైనం

పారిశుధ్య కార్మికులకు జీతాలు నిల్..

గత ఆరు నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులకు కనికరం లేదు. తెల్లారితే చాలు.. రోడ్లను శుభ్రం చేయడం, మురుగు కాల్వలు బాగుచేయడం వంటి పారిశుధ్యపనులు చేసే కార్మికులకు నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో వారు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికుల అవస్థలు ఇవి. పంచాయతీ పరిధిలో 24మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో దేవస్థానం పదిమంది కార్మికులను పంచాయతీకి ఇచ్చింది. ఆ పదిమంది జీతాలను దేవస్థానం ద్వారా పంచాయతీకి వస్తే వాటిని వారికి పంచాయతీ అందిస్తుంది. ఈ 24మంది కార్మికులకు గత ఆరునెలలుగా పంచాయతీ జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అప్పులు చేసి ఇల్లు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దేవస్థానం ద్వారా వచ్చిన పదిమందిలో ఇద్దరు మానేశారు. మిగిలిన వారు జీతాలు అందక పోయినా బాధను దిగమింగుకుని పనులు చేస్తున్నారు.

అవినీతిపై విచారణ ఏదీ ?

ఈ పంచాయతీలో భారీ అవినీతి జరిగిందని గ్రామానికి చెందిన నిమ్మగడ్డ ఆముక్త ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. పలు పన్నుల రూపంలో వసూలైన సొమ్ము పక్కదారి పట్టిందని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇంటి కుళాయిపన్నుల వసూలు, నాలుగేళ్లుగా బ్లీచింగ్ కొనుగోలులో సుమారు రూ.20లక్షలు గోల్‌మాల్ అయ్యిందని ఫిర్యాదులో పేర్కొంది. పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని, ప్రస్తుతం కార్మికులకు జీతాలు ఇవ్వకుండా చేతులెత్తేశారని పేర్కొంటూ ఫిర్యాదు చేసినా దానిపై ఇంతవరకూ స్పందన లేదని చెబుతున్నారు. ఇప్పటికే చాలాసార్లు ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలవుతున్నాయిని, ఇప్పటికైనా ఈ వ్యవహారంపై నిజనిర్దారణ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పంచాయతీ నిర్లక్ష్యంతో పేరుకున్న చెత్త..

ద్వారకాతిరుమలకు పలు ప్రాంతాల నుంచి భక్తులతో పాటు నిత్యం అధికారులు సైతం ఈ రహదారులపై సంచరిస్తుంటారు. ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారం పేరుకున్నా ఇక్కడి అధికారులకు చీమకుట్టినట్టయినా లేదు. గ్రామంలో పలు రహదారులు చెత్తతో నిండి ఉన్నాయి. పారిశుధ్యకార్మికులకు జీతభత్యాలు సక్రమంగా ఇవ్వక పోవడంతో వారితో పనులు చేయించుకునేందుకు అధికారులు జంకుతున్నారు. ఇప్పటికైనా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిపించేలా ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.


ద్వారకాతిరుమల ప్రధానరహదారి పక్కన పేరుకున్న చెత్త


స్థానిక పెట్రోల్ బంకు పక్కన


చిన్నతిరుపతికి వచ్చే రహదారి పక్కనే చెత్త

వసంత పంచమికి 'వీరంపాలెం క్షేత్రం' సిద్ధం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 11: చిన్నారులకు అక్షరాభ్యాస వేడుకలకు ఎంతో ప్రతిష్ఠాత్మక దినంగా భావించే ఈనెల 14న నిర్వహించే వసంత పంచమి వేడుకలకు తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రం సిద్ధమవుతోంది. బాసరలో సరస్వతి అమ్మవారి ఆలయంలో అక్షరాభ్యాసాలు చేసే మాదిరిగా ప్రతీ ఏటా సరస్వతి, దక్షిణామూర్తి సమక్షంలో తమ చిన్నారులకు పవిత్ర పర్వదినం రోజున అక్షరాభ్యాసాలు చేస్తే మంచి విద్యాబుద్ధులు అబ్బుతాయని పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి వివరించారు. వేలాదిగా వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు.


వీరంపాలెంలో అక్షరాభ్యాసాలకు ఏర్పాట్లు (ఇన్‌సెట్‌లో) సరస్వతి అమ్మవారు

కవిటం మహాయాగంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

అతిరుద్ర మహాయాగం ప్రారంభం

పోడూరు, ఫిబ్రవరి 11: కవిటంలో శ్రీఉమా రామలింగేశ్వరరావు, శర్వాణి స్కూల్ ఆధ్వర్యంలో 14 రోజుల పాటు నిర్వహించనున్న అతిరుద్ర మహాయాగం ఆదివారం ప్రారంభమైంది. ముందుగా విఘ్నేశ్వరపూజతో యాగం ప్రారంభమైంది. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మహాయాగంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవాల్లో భాగంగా సోమవారం కాణిపాకం శ్రీసిద్ధి బుద్ధి సమేత వరసిద్ధివినాయక స్వామి దివ్య లీలా కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 11: అంతర పంటలతో రైతులు అధిక ఆదాయాన్ని పొంద వచ్చని రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు తిరుపాల్‌రెడ్డి అన్నారు. మండ లంలోని వెంకటకృష్ణాపురం, పంగిడిగూడెం గ్రామాల్లో రైతులు వేసిన పలు పంటలను, డ్రిప్ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి సాగులో మెలకువలను రైతులకు సూచించారు. అనంతరం కొబ్బరి, కోకో, వక్క, జాజికాయ పంటలను అంతర పంటలుగా సాగుచేయ డాన్ని గుర్తించి రైతులను అభినం దించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి రామ్మోహన్‌రావు, భీమడో లు ఏడీఏ శైలజ, మండల ఏవో దుర్గామేశ్ పలువురు రైతులు పాల్గొన్నారు.


పంగిడిగూడెంలో కోకో గెలను పరిశీలిస్తున్న తిరుపాల్ రెడ్డి తదితరులు

శ్రీవారి సన్నిధిలో పూజలు

చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు తిరుపాల్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ అర్చకుల నుంచి వేదాశీర్వచనం, ఏఈవో మెట్టపల్లి దుర్గారావు నుంచి శ్రీవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను పొందారు.

రేషన్ డీలర్లకు రూ.10 వేలు వేతనం, కమీషన్ ఇవ్వాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో రేషన్ డీలర్లకు రూ.10 వేలు వేతనం, క్వింటా బియ్యానికి రూ.150 వంతున కమీషన్ ఇవ్వాలని ఏలూరు జిల్లా రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజులపాటి గంగాధరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా రేషన్ డీలర్లు పంపిణీ చేయాల్సిన సరుకులను ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ ద్వారా పంపిణీ చేయిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో డీలర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రేషన్‌డీలర్ల వ్యవస్థకు సమాంతరంగా ఎండీయూ వ్యవస్థను ఏర్పాటుచేసి వారి ద్వారా రేషన్ పంపిణీ చేయించటం దుర్మార్గం అన్నారు. డీలర్లకు తెలంగాణలో ఉన్న విధంగా రాష్ట్రంలోని డీలర్లందరికి గౌరవవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.7,500, పట్టణ ప్రాంతాల్లో రూ.10వేలు ఇచ్చి క్వింటా బియ్యంకు రూ.150 కమీషన్ ఇవ్వాలన్నారు. గత టీడీపీ పాలనలో మాదిరిగా డీలర్లకు బీమా సౌకర్యం, హెల్త్ కార్డులు, సంక్షేమ నిధిని ఏర్పాటుచేసి చనిపోయిన డీలర్లకు మట్టిఖర్చుల కింద రూ.15వేలు ఇవ్వాలని, సామాజిక పెన్షన్లను డీలర్ల ద్వారా పంపిణీ చేయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


రాజులపాటి గంగాధరరావు

గ్రంథాలయాల ఉద్యోగులకు 010తో జీతాలివ్వాలి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 11: గ్రంథాలయాల ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని ఏపీ రాష్ట్ర జిల్లా గ్రంథాలయాల సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు అన్నారు. విజయవాడలో ఏపీఎన్‌జీవో భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల ఐక్యకార్యాచరణ సమితి విస్తృతస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగులను అధికారులు వేధిస్తున్నా రన్నారు. మెమోలు, షోకజ్‌నోటీసులు ఇస్తున్నారన్నారు. ప్రశ్నించినవారిని డిప్యూటేషన్ పేరుతో సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉద్యోగ సంఘ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ బండి శ్రీనివాసరావును కోరామన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జుల్ఫీకర్ ఆలీ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

పెదవేగి, ఫిబ్రవరి 11 :పెదవేగి మండలం జానంపేట సమీపంలో పోలవరం కుడికాలువ గట్టును యథేచ్ఛగా తవ్వేస్తూ అక్రమంగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. శనివారం రాత్రి పోలవరం కుడికాలువ గట్టును తవ్వేస్తూ మట్టిని తరిస్తున్నారనే సమాచారంతో ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్కే. ఖాజావలి దాడిచేసి, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న టిప్పర్లను పెదవేగి తహసీల్దారు కార్యాలయానికి తరలించారు.


స్వాధీనం చేసుకున్న మట్టి టిప్పర్లు

టీడీపీ నాయకుల ఇంటిపై వైసీపీ మూక దాడి

▸ ఇంటిలో వస్తువులు ధ్వంసం..

కొప్పాక గ్రామానికి చెందిన కాటేపల్లి సాంబశివరావు, అతడి అన్న సత్యవర్ధన్ టీడీపీ నాయకులు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గుంపుల రంగారావు, పోతురాజు, బైరెడ్డి వెంకన్న తదితరులు పోలవరం కుడి కాలువ గట్టును అక్రమంగా తవ్వుతూ సొమ్ములు చేసుకుంటున్నారు. ఈక్రమంలో పలుమార్లు అధికారులు అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న టిప్పర్లను, ఎక్స్‌కవేటర్‌లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఇది టీడీపీ నాయకులైన సాంబశివరావు, సత్యవర్ధన్‌లు సమాచారం అందించడంతోనే అధికారులు మా వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారని భావించిన వైసీపీ నాయకులు గుంపుల రంగారావు, పోతురాజు, బైరెడ్డి వెంకన్న ఆధ్వర్యంలో దాదాపు వంద మందికి పైగా వైసీపీ శ్రేణులు.. టీడీపీ నాయకులు అన్నదమ్ముల ఇంటిపై దాడికి వెళ్లారు. తొలుత సత్యవర్ధన్ ఇంటిపై దాడి చేస్తుండగా సాంబశివరావు తన ఇంటికి తాళం వేసి అతడి ఇంటికి వెళ్లారు. సాంబశివ రావు కుటుంబ సభ్యులందరూ సత్యవర్ధన్ ఇంటిదగ్గర ఉండగానే కొంతమంది వైసీపీ శ్రేణులు వెనుకగా వెళ్లి తాళం వేసి ఉన్న సాంబశివరావు ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో ప్రవేశించి బీరువా, మంచాలు టీవీ ఫ్రిజ్ ఇతర వంట సామగ్రి మొత్తం ధ్వంసం చేశారు. అడ్డుపడ్డ కాటేపల్లి సాంబశివరావు, అతడి కుమారుడు నాగసురేష్, సోదరుడు సత్యవర్ధన్, ఆయన కోడలు ఐశ్వర్యలపై దాడికి తెగబడి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కొప్పాకకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇదంతా కక్షపూరితంగానే చేస్తున్న చర్యగా బాధితులు పేర్కొన్నారు.

క్రైం కార్నర్: వేర్వేరుచోట్ల ఎనిమిది మంది మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వేర్వేరు చోట్ల ఆదివారం మొత్తం ఎనిమిది మృతి చెందారు. శుభలేఖలు అందించేందుకు వెళ్లిన పెళ్లికొడుకు దెందులూరు మండలంలో మృతి చెందాడు. పోలవరం మండలంలో ఆటో ట్రాక్టర్ ఢీకొని ఒకరు, రామసింగవరంలో విద్యుదాఘాతంతో వలంటీర్ దుర్మరణం. గుండుగొలనుకు చెందిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందారు. జీలుగుమిల్లి మండలంలో రోడ్డు ప్రమాదంలో మహిళ, ఉండి మండలంలో మోటారు సైక్లిస్టు, పురుగుల మందు తాగి వృద్ధుడు, తాడేపల్లిగూడెంలో యువకుడు మృతి చెందారు.

ఆటో ట్రాక్టర్ ఢీ.. ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు

పోలవరం, ఫిబ్రవరి 11 : ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన పట్టిసీమ పంచాయతీ వెంకటాపురంలో శనివారం రాత్రి జరిగింది. పోలవరం ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాలివి.. పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శీలం రాంబాబు అదే గ్రామానికి చెందిన పెనుబాక లక్ష్మి, నిడదవోలు గ్రామానికి చెందిన మెరుపో రమణమ్మ(45)ఆటోలో తాళ్ళపూడి ఆస్పత్రికి బయలుదేరగా మార్గమధ్యలో చెరుకు ఫ్యాక్టరీ సమీపంలోకి వచ్చేసరికి పోలవరంవైపు నుంచి వేగంగా వెళుతున్న ట్రాక్టర్ ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు 108 వాహనంలో పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ సిఫారసు చేశారు. మార్గమధ్యలో రమణమ్మ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


ప్రమాదంలో నుజ్జయిన ఆటో

విద్యుదాఘాతంతో వలంటీర్ మృతి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 11: విద్యుదాఘాతంతో ఓ వలంటీర్ మృతి చెందిన ఘటన రామసింగవరంలో శనివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఓగిరాల నరసింహారావు(35) గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. దీనిలో భాగంగా అతడు సొంత ఇంటిని కట్టుకునే క్రమంలో పక్కనే ఓ గుడిసె వేసుకుని అందులో శనివారం రాత్రి ఫ్యాన్‌ను బిగిస్తున్నాడు. ఈక్రమంలో చేతికి వైరు తగిలి షాక్‌కు గురై మృతిచెందాడు. అతడికి ఇంకా వివాహం కాలేదు. ఆదివారం ఉదయం మృతదేహన్ని పోస్‌మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


వలంటీర్ మృతదేహం

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భీమడోలు, ఫిబ్రవరి 11 : భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలో మద్యానికి బానిసై భార్య మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గుండుగొలనుకు చెందిన తలారి కొండయ్య (47) కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై గత నెల 19వ తేదీన భార్యను మద్యం కోసం సొమ్ములు అడుగగా లేవని చెప్పడంతో ఆమెతో గొడవపడి ఇంట్లో ఉన్న కలుపు మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశారు. చికిత్స నిమిత్తం ఏలూరు, తొలుత విజయవాడ తరలించగా ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీనిపై బంధువుల ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 11 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన పండువారిగూడెం వద్ద జరిగింది. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట శివారు దొంతికుంట గ్రామానికి చెందిన పచ్చినీల జ్యోతి(37) భర్త రాజాతో కలసి ఆదివారం జంగారెడ్డిగూడెం మండలం బయ్యనగూడెం శుభకార్యానికి బైక్‌పై వెళ్లారు. తిరగి ఇంటికి వచ్చే క్రమంలో దర్బగూడెం సమీప పండువారి గూడెం జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు బైక్ నుంచి జారిపడింది. ఈ ప్రమాదంలో తలభాగం రోడ్డుకు తగలడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.

వాహనం ఢీకొని మోటారు సైక్లిస్ట్ మృతి

▸ మరో వ్యక్తికి తీవ్రగాయాలు

ఉండి, ఫిబ్రవరి 11 : ఓ వాహనం ఢీకొని మోటారు సైక్లిస్టు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలైన ఘటన ఉండి మండలం యండగండిలో జరిగింది. ఉండి పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమవరం నుంచి అత్తిలికి మోటారుసైకిల్‌పై వెళ్తున్న చిన్నంపల్లి రామ్మూర్తి(45), ములగాల జగదీష్‌లను ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో మోటారుసైక్లిస్టు రామమ్మూర్తి అక్కడే మృతిచెందాడు. గాయపడిన మరొక వ్యక్తి జగదీష్‌ను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉండి ఎస్‌ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

ఉండి, ఫిబ్రవరి 11 : కీళ్లనొప్పులు, అరికాలు పోట్లను భరించలేక మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. ఆదివారం ఉండి పోలీసులు తెలిపిన వివరాలివి.. వాండ్రం గ్రామానికి చెందిన బోను సూర్యనారాయణ(75) కీళ్లనొప్పులు, అరికాలు పోట్లు భరించలేక మద్యంలో పురుగుల మందును కలుపుకుని శనివారం రాత్రి తాగాడు. ఉదయం అతడి నోటి నుంచి నురుగ రావడంతో కుటుంబసభ్యులు భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో మృతి చెందగా పోస్టుమార్టం నిర్వహించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

పెళ్లింట విషాదం

శుభలేఖలు ఇచ్చేందుకు వెళుతూ..

ఆగిన లారీని ఢీకొట్టి పెళ్లికొడుకు మృతి

దెందులూరు, ఫిబ్రవరి11 : ఓ పెళ్లికొడుకు పదిరోజుల్లో పెళ్లి జరుగుతుందనే ఆనందంలో పెళ్లికుమార్తె ఇంటికి శుభలేఖలు ఇచ్చేందుకు వెళ్తూ ఆగి ఉన్న లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాలివి.. విజయవాడ సిటి పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన షేక్ ఫరీద్(22)కు నిడదవోలుకు చెందిన యువతితో జనవరిలో పెళ్లి చూపులు పూర్తి కాగా ఈనెల 21న వివాహం నిర్ణయించుకున్నారు. ఆదివారం ఉదయం నిడదవోలులోని పెళ్లికుమార్తె ఇంటికి శుభలేఖలు ఇచ్చేందుకు మోటారు సైకిల్‌పై వెళ్తూ 16వ నంబరు హైవే కొఇరేపల్లి సమీపంలో తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న లారీ అప్పటికు ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈమేరకు కారు డ్రైవర్.. లారీ డ్రైవర్ మాట్లాడుతుండగా రోడ్డు మధ్యలో నిలిచి ఉంచిన లారీని వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి శవ పరీక్షల నిమిత్తం అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మృతుడు తల్లిదండ్రులు, పెళ్లి కుమార్తె తల్లిదండ్రులు రక్తంతో తడిసిన శుభలేఖలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఈ మేరకు రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.


కొమిరేపల్లి వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

పెదపాడు, ఫిబ్రవరి 11 : కృష్ణా - ఏలూరు జిల్లాల సరిహద్దు ప్రాంతం కలపర్రు టోల్‌గేట్ సమీపంలో శనివారం రాత్రి 12 గంటల సమయంలో విజయవాడ నుంచి విశాఖపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వున్న లారీని ఢీకొన్న ఘటనలో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వైద్యసిబ్బంది రెండు 108 అంబులెన్స్‌లలో క్షతగాత్రులను హనుమాన్‌జంక్షన్, ఏలూరు నగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు చికిత్స నిమిత్తమై తరలించారు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.


ప్రమాదానికి గురైన బస్సు

యువకుడి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 11: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెం పట్టణంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలివి.. పట్టణంలోని సిపాయిపేటకు చెందిన ముత్యాల పవన్(27) కారు నడుపుకునేందుకు 2022లో కారు కొనుగోలు చేశాడు. అయితే సరిగా కిరాయిలు లేకపోవడంతో వాయిదాలు చెల్లించలేక, ఇతర ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులతోనే తనువు చాలిస్తున్నట్టు సూసైడ్ నోట్ లభ్యమైనట్టు ఎస్‌ఐ సుధాకరరెడ్డి తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

ప్లాస్టిక్ గొడౌన్‌లో మంటలు

▸ రాయలం రోడ్డులో భారీ అగ్నిప్రమాదం..రూ.5 లక్షల ఆస్తి నష్టం

భీమవరం క్రైం, ఫిబ్రవరి 11 : భీమవరం పట్టణ శివారు రాయలం గ్రామ పరిధిలో భారీ ఎత్తున అగ్నిప్రమాదం సంభవించింది. ఎస్ఎస్‌వీ టవర్స్ అపార్ట్‌మెంట్ పక్కన ఓ ప్లాస్టిక్ గొడౌన్‌కు ఆదివారం సాయంత్రం నిప్పం టుకుంది. ప్లాస్టిక్ గొడౌన్ పూర్తిగా దగ్ధమైంది. భారీస్థాయిలో మంటలు వ్యాపించి పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపు చేశారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో కూడా మంటలు వ్యాపిస్తూనే ఉన్నాయి. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం సుమారు ఐదు లక్షల రూపాయల వరకు ఉంటుందని భీమవరం అగ్నిమాపక అధికారి సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


గోడౌన్‌లో మంటలు వ్యాపిస్తున్న దృశ్యం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు

పెదవేగి, ఫిబ్రవరి 11: రాట్నాల కుంట రాట్నాలమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంపీపీ తాతా రమ్య తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల భక్తులు అమ్మవారికి పూజలు చేసి పాల పొంగలి నైవేధ్యం సమర్పించారు. అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్య శర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

నారాయణపురంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం, పాల్గొన్న భక్తులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 11: నారాయణపురంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం కల్యాణం జరిపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. కల్యాణ మహోత్సవంలో 14 జంటలు పాల్గొన్నాయని ఆలయ కమిటీ తెలిపింది.

వాసవీ మాతకు లక్ష పసుపు కొమ్ములతో పూజ



పూజలు చేస్తున్న మహిళలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 11 : వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా రామకోటి ప్రాంగణంలో ఆదివారం లక్ష పసుపు కొమ్ములతో పూజ చేశారు. పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని, బడేటి చంటి, రెడ్డి అప్పలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. నగరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఆర్యవైశ్య మహిళలు సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● చింతలపూడి: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పూజా సామగ్రిని అందించారు. మహిళలు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: కైకరం శివాలయంలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి 25 మంది ఆర్య వైశ్య మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు లంక రాంబాబు అమ్మవారికి పూజలు చేయించారు.

రాట్నాలకుంటలో రామలింగేశ్వరస్వామి లింగ ప్రతిష్ఠ



ఆలయంలో శివలింగ ప్రతిష్ఠ

పెదవేగి, ఫిబ్రవరి 11: రాట్నాలమ్మ ఆలయ ఆవరణలో నిర్మించిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో లింగ ప్రతిష్ఠ ఆదివారం నిర్వహించారు. వైభవంగా లింగ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పావులూరి వీరవెంకట రామ సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు, ఆలయ అర్చకులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కొఠారు రామచంద్రరావు, ఎంపీపీ తాతా రమ్య రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న కుక్కునూరు సీఐ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సరిహద్దుల్లో పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల వద్ద 24 గంటలు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఆకస్మిక వాహనాల తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మద్యం, గంజాయి, సారా రవాణా కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు కొనసాగించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. అనుమానం కల్గిన వారిని విచారించారు.

రౌడీ షీటర్లు సత్‌ప్రవర్తనతో జీవించాలి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11: రౌడీ షీటర్లు సత్‌ప్రవర్తనతో జీవించాలని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని పోలీసు అధికారులు హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం, పోలవరం, ఏలూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రౌడీషీటర్లపై నిఘా పెంచామని ఎవరైనా రౌడీ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

పాఠశాలల విలీనంపై ప్రభుత్వం మాట తప్పింది



శామ్యూల్ దంపతులకు సన్మానం

చింతలపూడి, ఫిబ్రవరి 11: పాఠశాలల విలీనం ద్వారా ఒక్క పాఠశాల కూడా మూతపడదని సీఎం జగన్, మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారని, రాష్ట్రంలో 118 పాఠశాలలు మూతపడ్డాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శామ్యూల్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శామ్యూల్ దంపతులను మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వేల సంఖ్యలో ఎస్‌జీటీ పోస్టులు రద్దయ్యాయన్నారు. 117 జీవోను తక్షణం రద్దు చేయాలన్నారు. దీని ద్వారా పాఠశాలల విలీనం నిలిపివేయాలన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ వచ్చినందున తక్షణం ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని కోరారు. నాలుగేళ్లగా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 11 పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు కేఆర్.పవన్, జి.రాము, ఎ.వర్మ, ఎం.సత్యనారాయణ, టి.సుధాకర్, ఎ.మురళీకృష్ణ, ఎస్.కిరణ్‌బాబు, మహిళా నాయకురాలు ఝాన్సీరాణి, పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు భారీగా పాల్గొన్నారు

యాదవ సంఘ కమ్యూనిటీ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 11: స్థానిక 32వ డివిజన్‌లో నిర్మించిన యాదవ సంక్షేమ సంఘం కమ్యూనిటీ భవనాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు సముచిత స్థానం కల్పించిన ఘనత జగన్మోహన్‌రెడ్డిది అన్నారు. రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు ఎంపీ నిధులు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యం ఇస్తారన్నారు. దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, మేయర్ షేక్ నూర్జహాన్, ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, కారుమూరి సునీల్ యాదవ్, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు బుజ్జి, గొర్ల రామారావు, శ్రీనివాసరావు, బొట్టా అజయ్, మల్లిపూడి రాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఏలూరు టూటౌన్: గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో మేకల, గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ భవనాన్ని మంత్రి కారుమూరి ప్రారంభించారు. గొర్రెలను, మేకలను 50శాతం సబ్సిడీపై పెంపకందారులకు అప్పగిస్తున్నామన్నారు. ఎంపీ మస్తాన్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఫెడరేషన్ చైర్మన్ ప్రకాశ్‌యాదవ్, జేడీ నెహ్రూబాబు, ఏడీ లక్ష్మీనారాయణ, గంటా ప్రసాదరావు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీకి సాల్మన్‌రాజు, రంగావలి ఎన్నిక

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 : ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఏలూరుకు చెందిన బీ.ఏ.సాల్మన్‌రాజు, ఆడిట్‌కమిటీ సభ్యునిగా ఎస్.కె.రంగావలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర ఆదివారం తెలిపారు. విజయవాడలో జరిగిన ఎన్నికల్లో వారు ఎన్నికయ్యారన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వారు మరింత కృషిచేయాలని ఆకాంక్షించారు.

టీడీపీలోకి వలసలు

వైసీపీ నుంచి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో కలిసి అభివాదం చేస్తున్న చింతమనేని

పెదవేగి, ఫిబ్రవరి 11: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీలో పలువురు నాయకులు, కార్యకర్తలు వలసబాట పట్టారు. పెదవేగి మండలంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరడంతో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పార్టీ కండువా కప్పి స్వాగతించారు. కూచింపూడికి చెందిన వైసీపీ నాయకులు ముత్యాల కనకరాజు, వెన్నమనేని బాబి, గంగాధరరావు, సాయిన పెద్దిరాజు, బర్మా పూర్ణచంద్రరావు, జక్కా శివనాగ అనిల్, రాజేష్, రామానుజం గణేష్, రాంబాబు, రవి, పూజారి గంగాధరరావు, పెద్దిశెట్టి రాట్నాలరాజు, వంశీ, సతీష్, బండారు శ్రీనివాసరావు తదితరులు ఆదివారం చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరారు. ప్రభాకర్ మాట్లాడుతూ కూచింపూడిలో ఏ సందు చూసినా రాళ్ళరప్పలతో నిండి ఉండేదని, పక్కా రహదారులు ఏర్పాటుచేసి, డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి, ప్రజలకు సౌకర్యవంతమైన పాలన జరిగింది టీడీపీలోనేనన్నారు. వైసీపీ పాలనలో కూచింపూడి అభివృద్ధికి తీసుకున్న చర్యలేవీ లేవన్నారు. టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, గిత్తా సత్యనారాయణ, రామానుజం వెంకటేశ్వరరావు, అడపా శ్రీను, తాతా శ్రీరామ్మూర్తి, గుర్రం మాధవ తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: ప్రజలు వైసీపీ పాలనతో విసిగిపోయి టీడీపీ వైపు అడుగులు వేస్తున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. పవర్‌పేట బడేటి కార్యాలయంలో టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు చేరారు. వారందరికి చంటి టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాకాల రమేష్, జాలా సుమతి బాలాజీ, నాయకత్వంలో టీడీపీలోకి వచ్చారు.

టీడీపీ నాయకుల పర్యటన

జంగారెడ్డిగూడెం టౌన్: నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 28, 29 వార్డుల్లో టీడీపీ నాయకులు పర్యటించారు. గేరుముచ్చు గోపాల్ యాదవ్, సొంగా రోషన్ కుమార్ తదితరులు మాట్లాడారు. రావూరి కృష్ణ, పెనుమర్తి రామ్‌కుమార్, రాజాన సత్యనారాయణ, కొండేటి కిషోర్ చెరుకూరి శ్రీధర్, కోనేటి చంటి, కోటగిరి ప్రమీల, పగడం సౌభాగ్యవతి గుల్లపూడి శ్రీదేవి, నాని, గుబ్బల ప్రసాద్, అల్లూరి రామకృష్ణ, కాసాని ప్రసాద్, బేతాళ మురళి, తదితరలు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం పట్టణంలో పర్యటించిన నేతలు

పెదనింద్రకొలనులో మన ఇంటికి మన గన్ని

నిడమర్రు: రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. పెద నింద్రకొలనులో కార్యకర్తలతో కలసి మన ఇంటికి మన గన్ని కార్యక్రమంలో స్థానికుల సమస్యలు తెలసుకున్నారు. ఉదిసే జ్యోతి రాంమూర్తి, ముత్యాల స్వామి, పొట్నూరి సింహాచలం, ఆర్.వెంకటేశ్వరరాజు, తదితరులు పాల్గొన్నారు.





ఉంగుటూరు మండలంలో ధర్మరాజు పర్యటన, కొయ్యలగూడెంలో జనసేనలో చేరిన కార్యకర్తలు, ఏలూరులో మాట్లాడుతున్న ఘంటసాల వెంకటలక్ష్మి

రాక్షస పాలన అంతమొందించాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో రాక్షసపాలన అంతమొందించడమే లక్ష్యంగా పనిచేయాలని జనసేన పార్టీ దెందులూరు నియోజకవర్గ సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం వెంకటలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ప్రతి జనసేన నాయకులు, కార్యకర్తలు వైసీపీ పాలనను అంతమొందించి రాష్ట్రప్రజలను కాపాడేందుకు కంకణబద్ధులు అవ్వాలని జనసేన, టీడీపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. పొత్తులో భాగంగా జనసేన, టీడీపీ అభ్యర్థికి సీటు ప్రకటించినా కూడా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. నారా శేషు, రాఘవయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు, కరాటం సాయిబాబు అన్నారు. బయ్యన్నగూడెంలో ఆదివారం జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలకు వెళ్లడానికి రహదారులు కూడా వెయ్యలేని ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. రోడ్లు కనీస మరమ్మతులు కూడా చేపట్టకుండా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గడిపేసిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని గద్దె దించాలని జనసేన, టీడీపీ విజయానికి ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బయ్యన్నగూడెంలో ఇంటింటికి వెళ్లి పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో తోట రవి, మద్దు తేజ, దుగ్గిన శ్రీను, చోడి పిండి సుబ్రహ్మణ్యం, మాదేపల్లి శ్రీను, ఏపూరి సతీష్, సుంకర రాజేష్, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీలకు చెందిన వంద మంది యువకులు జనసేన పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్రి బాలరాజు, కరాటం సాయిబాబు వారికి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో వెంకట్, పారేపల్లి పండు, చిన్నం మహేష్, గోపి, వీరమహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: వైసీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉప్పాకపాడులో జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ ఇంటి మంగరాజు, పంది రాంబాబు, నిమ్మల దొరబాబు, అంబటి మాధవి, ముత్యాల సునీత, పెద్దిశెట్టి తులసి, మంచాల వెంకటలక్ష్మి, రాగాల రవి, దాసరి నాగరాజు, కుంపట్ల భరత్ కుమార్, ముత్యాల రూప మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంలో పలువురు జనసేన పార్టీలో చేరారు. కంభంపాటి రమేష్, గరగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిని ఇన్‌చార్జి ధర్మరాజు ఆహ్వానించారు. సురత్తుల అయ్యప్ప, తాడిశెట్టి శివ ప్రసాద్, ఇల్లిందల సురేష్, వెజ్జు బాబు నాయుడు, మీసాల హరిబాబు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: జగన్ రెడ్డి సీఎం పదవికి అనర్హుడని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. నగిరెడ్డి కాశీ నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం కులాలను విడదీస్తూ బ్రిటీష్ తరహాలో పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఘంటశాల వెంకటలక్ష్మి, నరిది రాజేష్, ఒబిలిశెట్టి శ్రావణకుమార్‌గుప్త, పులి శ్రీరాములు, రామ్మోహన్‌రావు, చంద్రశేఖర్, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.





వేలేరుపాడు మండలంలో పర్యటిస్తున్న తపనా చౌదరి, లింగపాలెంలో బీజేపీ నేతల ప్రచారం, బుట్టాయగూడెంలో బీజేపీలో చేరిన కార్యకర్తలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం

బీజేపీ నేత తపనా చౌదరి

వేలేరుపాడు, ఫిబ్రవరి 11: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపనా చౌదరి) అన్నారు. బీజేపీ పల్లె నిద్రలో భాగంగా మండలంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. బీజేపీ, జనసేన పార్టీ సిద్ధాంతాలు రెండు ఒకేవిధంగా ఉన్నాయని, రాష్ట్రంలో, దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలన్నారు. నిర్వాసితుల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా వెళతామన్నారు. జనసేన మండల అధ్యక్షుడు గణేషుల ఆదినారాయణ పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. మేచినేని సంజయ్, కొవ్వాల క్రాంతి కుమార్, సుధాకర్, పొట్ల మోహన్, కేచ్చేలా శ్రీను, భాను పాల్గొన్నారు.

● కుక్కునూరు: తపన ఫౌండేషన్ ద్వారా ప్రజలకు మరింత సేవ చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనా చౌదరి అన్నారు. మండలంలో పల్లెకు పోదాం కార్యక్రమం అనంతరం పార్టీ కార్యాలయంలో తపన ఫౌండేషన్ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా మహిళల ఆర్థిక బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో కుక్కునూరు మండలంలో మరిన్ని అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. మొడియం శ్రీనివాసరావు, వల్లాల రాధాకృష్ణ, తూము వెంకన్న, ఉపాధ్యక్షుడు దుద్దుకూరి కృష్ణార్జునరావు, వెలకం బాలకృష్ణ, సున్నం మహేష్, చింతా భాస్కర్, కునవరపు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనా చౌదరి ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. కట్టా సత్యనారాయణ, కొండేపాటి రామకృష్ణ, బొల్లిన నిర్మల కిషోర్, మొడియం శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

● ఉంగుటూరు: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాలలో ఇంటింటికి కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. కైకరం, బాదంపూడి, నారాయణపురం గ్రామాలలో కార్యకర్తలు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనచర్ల భాస్కరరావు, పరిమి సత్యనారాయణ, రుద్రరాజు శ్రీనివాసరాజు, అడపా శోభారాణి, కాకిలేటి వెంకటేశ్వరరావు, శానం రామాంజనేయులు, రజని తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: జైనవారిగూడెంకు చెందిన పలువురు మహిళలు బీజేపీలో చేరారు. పల్లెకు పోదాం కార్యక్రమాన్ని జైనవారిగూడెంలో నిర్వహించి ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీలో చేరిన వారికి కొండేపాటి రామకృష్ణ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సోము హరినారాయణ, దాసరి రాంబాబు, అనిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, ఆర్ఎస్ఎస్ చక్రధర్‌రావు ఆధ్వర్యంలో మండలంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. బొండాడ నరేంద్రప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, ఎస్.వి నాగేశ్వరరావు, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

దీన్ దయాళ్‌కు పలువురు నేతల నివాళి

ఏలూరు టూటౌన్, ఉంగుటూరు, చింతలపూడి, కామవరపుకోట, ఫిబ్రవరి 11: బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి కార్యక్రమం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగం శివ, గాది రాంబాబు నివాళులర్పించారు ఎం.శ్రీనివాస్, జీ.వెంకటరమణ, మహేష్, లక్ష్మణ్, కామేష్, తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరులో నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి నివాళులర్పించారు. అడపా శోభారాణి, వంజరపు దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు. చింతలపూడిలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్.విక్రమకిషోర్, టి.వెంకట నారాయణ, చక్రధరరావు నివాళులర్పించారు. కామవరపుకోట బీజేపీ కార్యాలయం వద్ద దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఒంటెద్దు ఏసువరప్రసాద్, కాకి సురేష్‌కుమార్, జెర్రిపోతుల లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కార్మికుల నిరసన

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 11: మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఇటీవల చేసిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఆమోదించిన జీవోలు విడుదల చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విఘ్నేశ్, భజంత్రి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమ్మె ఒప్పందాలపై ప్రభుత్వం స్పందించలేదన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

16న భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రైవేటీకరణ విధానాలు, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కృష్ణామాచార్యులు, రెడ్డిశ్రీనివాస్ డాంగే కోరారు.





ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడిలో అమర గాయకుడు ఘంటసాల విగ్రహాలు, చిత్రపటం వద్ద గాయకులు, ప్రముఖుల నివాళి

అమర గాయకుడు ఘంటసాల

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 11: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుకు పలువురు నివాళులర్పించారు. ఆయన వర్ధంతి పురస్కరించుకుని రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి ప్రాంగణంలో విగ్రహానికి ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ గాన గంధర్వుడు ఘంటసాల అని కొనియాడారు. ఎస్‌కే సుభానీ మాట్లాడుతూ సినిమా పాటలకు ఘంటసాల అత్యంత అరుదైన గౌరవాన్ని తీసుకువచ్చాడని కొనియాడారు. ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో సంగీత విభావరి అలరించింది. పలువురు వర్ధమాన గాయకులు, నాటి మధుర గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు. సంగీత కళాశాల నిర్వాహకులు రేవతి రామ్ కుమార్, మహ్మద్ ఖాజావలీ, పుల్లాబొట్ల పురుషోత్తం, లంకా వెంకటేశ్వర్లు, వై.అర్జున్‌రావు, మనస్విని, హర్షిత, ఆనందనాయుడు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: భగవద్గీతను గానం చేసి ఘంటసాల జన్మధన్యమని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. గాయకుడు చిలుకూరి సుబ్బయాచారి ఆధ్వర్యంలో ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. పాటల ద్వారా ఘంటసాల చిరస్మరణీయుడని మల్లాది సీతారామారావు కొనియాడారు. కార్యక్రమంలో కర్రా శ్రీధర్, చిట్రోజు తాతాజీ, తిప్పాబొట్ల రామకృష్ణ, నీరజ పాల్గొన్నారు.

● చింతలపూడి: అమర గాయకుడు ఘంటశాల వర్ధంతి పాత బస్టాండ్ వద్ద నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ మధుర గాయకుడు ఘంటశాల వెంకటేశ్వరరావు తెలుగు జాతికి గర్వకారణమన్నారు. ఈ నెల 25న స్థానిక మేడబడిలో కచేరి ఏర్పాటు చేశామన్నారు. ఆది సత్యనారాయణ, పాకా సర్వేశ్వరరావు, కొత్తపూడి శేషగిరిరావు, చిట్టూరి కాశీ, నాగరాజు, ఆచారి, నరం కృష్ణ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



భీమడోలు హైస్కూలులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

50 ఏళ్ల తర్వాత కలసిన మిత్రులు

భీమడోలు, ఫిబ్రవరి 11 : భీమడోలు హైస్కూలులో 50 ఏళ్ల క్రితం కలసి చదువుకున్న వారంతా ఆదివారం తిరిగి కలుసుకున్నారు. పాఠశాలలో 1973-74 , 74-75 బ్యాచ్‌ల్లో సుమారు వంద మంది పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కోలాహలంగా జరిగింది. 50 ఏళ్ల తరువాత ఒక చోట కలవడం మధురానుభూతి అని వారన్నారు. అప్పటి గురువులతో పాటు విద్యార్థులు తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా అప్పటి గురువులను విద్యార్థులంతా సత్కరించారు. పూర్వ విద్యార్థి గుప్తా పాఠశాల అభివృద్ధికి లక్ష రూపాయల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు సుబ్బారావు, మురళీకృష్ణ, బ్రహ్మారావు, ఎం అప్పాయన్, రాము తదితరులు పాల్గొన్నారు.



సింగగూడెంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

40 ఏళ్ల చిరకాల మైత్రి

లింగపాలెం, ఫిబ్రవరి 11: మండలంలోని సింగగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు 40 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీ సమ్మేళనం నిర్వహించారు. 1985-86 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు కలుసుకు నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విద్యనేర్పిన గురువులను సన్మానించారు. తమ దగ్గర విద్యనేర్చుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరటం తమకెంతో సంతోషమని పాధ్యాయులు ఆశీర్వదించారు. తమ కలయికకు గుర్తుగా పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. లక్కపాం ప్రకాష్, అన్నవరపు వెంకటేశ్వరరావు, పరిమి పాపారావు, తాతిన శ్రీనివాస్, సుధాకర్, సరోజిని, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలించిన డీఎస్పీ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

ఉంగుటూరు, ఫిబ్రవరి 11: రానున్న ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పక్షాలు సమయ్వయం పాటించి అధికారులకు సహకరించాలని డీఎస్పీ ఈ.శ్రీనివాసులు కోరారు. కైకరంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించి స్థానిక పోలీసులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట చేబ్రోలు ఎస్ఐ ఎ.మణి కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరులో ఉత్సాహంగా చదరంగం పోటీలు

ఏలూరు స్పోర్ట్స్, ఫిబ్రవరి 11: బహుజన ఆఫీసర్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి చదరంగం పోటీలను ఆదివారం నిర్వహించారు. అండర్ -15 విభాగాల్లో పోటీలను ప్రిన్సిపాల్ కుమార్ ప్రారంభించారు. చదరంగం మేదస్సును పెంచుతుందన్నారు. బహుజన ఆఫీసర్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు విజేతలకు బహుమతులు అందజేశారు. చెస్‌కోచ్ యోహానన్, పోటీల ఆర్గనైజర్ అరుణకుమారి పర్యవేక్షించారు. అండర్ -15 టాప్ -5లో జి.అభిషేక్ అవరహం, సిహెచ్ వివేక్, జి.అనురూప్ మోషే, బి.బియాన్‌రాజ్, టి.నవనీత్, అండర్ -7 బాలుర విభాగంలో ప్రశాంత్, అండర్ -9 విభాగంలో మరియదాసు, అండర్ -11 విభాగంలో డి.జశ్వంత్, దేవరకొండ ఎల్.వి విజ్ఞాన్‌భరత్, అండర్ -13లో తన్మయ్ సాయి గెలుపొందారు.

గ్రంథాలయ సందర్శన విజ్ఞానదాయకం

పెదవేగి, ఫిబ్రవరి 11: గ్రంథాలయాన్ని దర్శించుకోవడమంటే విజ్ఞానాన్ని పెంచుకోవడమేనని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. శాఖా గ్రంధాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంధాలయానికి వచ్చి గ్రంధపఠనం చేశారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంధపఠనం చేయాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** అనాథ పిల్లలను ఆదుకోవల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని బడేటి చంటి అన్నారు. అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారం హనుమంతరావు ఆధ్వర్యంలో రవితేజ వసతిగృహంలోని బాలబాలికల మధ్య బడేటి చంటి పుట్టినరోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. బాలబాలికలకు భోజనాలు ఏర్పాటు చేశారు.
- **ఏలూరు రూరల్ :** మల్కాపురం (పాలగూడెం, రక్షణ సైన్యం చర్చ్‌కి నూతన కమిటీలను నియమించారు. సంఘ పెద్దలుగా గరికపూడి నెహ్రూ, కొత్తూరు గోపీకుమార్, వెంపా నాగరాజు, నల్లమెల్లి ప్రసాద్, ఎం.సుధాకర్, మాత్రపు చింతయ్య, గృహసమితి సభ్యులుగా గరికపూడి సుప్రియ, పి.కుసుమ, ప్రమీల, నత్తా సోని, ఆర్.అంజలి, పి.కస్తూరి, పి.అరుణ నియమితులు అయ్యారు.
- **పెదపాడు :** ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా గుడిపాడు, వడ్డిగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు
- **టి.నరసాపురం :** బొర్రంపాలెంలో 4వవిడత ఆసరా చెక్కులను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పంపిణీ చేయనున్నట్లు ఏపీవో గంధం లలితాశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.
- **ఉంగుటూరు :** నారాయణపురం, చేబ్రోలు, తల్లాపురం, సీతారాంపురం, రాచూరు తదితర గ్రామాల ఆసరా లబ్ధిదారులకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చెక్కులు పంపిణీ చేశారు. జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.
- ఉంగుటూరు మండలం కైకరం వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. నారాయణం నాగేశ్వరరావు పాలకవర్గంతో ప్రమాణం చేయించారు.
- **కుక్కునూరు :** వాసు దేవ గురుస్వామి సారథ్యంలో కాకినాడ నుంచి భద్రాచలం వరకు సీతారామ చంద్రస్వామి పాదయాత్ర కుక్కునూరు చేరుకుంది. రామాలయం నుంచి గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. కోటగిరి సత్యనారాయణ, పిచుకరాజు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


ముదినేపల్లి వద్ద ఇసుకమేటతో పూడిన పోల్‌రాజ్ ప్రధాన పంట కాల్వ


పోల్ రాజ్ కెనాల్‌పై నీటి కోసం ఇంజన్ల ఏర్పాటు


అటపాకలో పూడుకుపోయిన పంటకాలువ


మండవల్లిలో పంటకాలువ దుస్థితి


బొమ్మినంపాడులో నీరందక ఎండిపోయిన మినుము పైరు

పంట కాల్వలు ఇలా...
సాగు నీరెలా?

ఎండుతున్న చేలు ▸ అన్నదాత గోడు వినేదెవరు? ▸ తాగునీటికీ పాట్లే

పంటకాల్వల నిర్వహణ లోపభూయిష్టంగా ఉండటంతో రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రధాన పంట కాల్వలతోపాటు బ్రాంచి కాల్వలు, డైరెక్ట్ పైపు కాల్వలు ఏళ్ల తరబడి పూడికతీతకు నోచుకోకపోవటంతో ఆయకట్టుకు సకాలంలో సక్రమంగా నీరందని పరిస్థితి ఏర్పడింది. అలాగే పలు పంట కాల్వలు ఆక్రమణకు గురవడం, మరికొన్ని తూడు పెరిగిపోవడంతో సాగు, తాగు నీరు అందడం లేదు. పట్టించుకోవాల్సిన అధికారులు మిన్నకుంటున్నారు. అన్నదాత గోడు వినేదెవరు?

ముదినేపల్లి, ఫిబ్రవరి 11 : ముదినేపల్లి ప్రాంతంలోని ప్రధాన పంట కాల్వలైన పోల్ రాజ్, క్యాంప్ బెల్ కాల్వలు పలు చోట్ల మట్టి దిబ్బలు, ఇసుక మేటలతో పూడుకుపోయాయి. ఈ కాల్వల ఆధునికీకరణలో భాగంగా 12 ఏళ్ల క్రితం తవ్విన అనంతరం ఇప్పటి వరకు సాగు సమస్యలు ఎదురవుతున్నా ఇరిగేషన్ శాఖ అభివృద్ధి పనులను చేపట్టలేదు. ముదినేపల్లి మండలంలో పోల్ రాజ్ కెనాల్ కింద సుమారు 10 వేలు, గుడివాడ ఛానల్ కింద సుమారు 5 వేలు, బీఎండీ చానల్ కింద సుమారు 5 వేలు, క్యాంప్ బెల్ ప్రధాన కాల్వ కింద సుమారు 13 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో సుమారు 16 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా, మిగిలిన ఆయకట్టు చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోయాయి. పోల్ రాజ్ ప్రధాన కాల్వకు సంబంధించి 14 బ్రాంచి కాల్వలు, 7 డైరెక్ట్ పైపు కాల్వలు ఉండగా, క్యాంప్ బెల్ ప్రధాన పంట కాల్వకు 10 బ్రాంచి కాల్వలు, 20 డైరెక్ట్ పైపు కాల్వలు ఉన్నాయి. డైరెక్ట్ పైపు కాల్వలను ఆయకట్టు రైతులే తవ్వుకుంటుండగా, బ్రాంచి కాల్వలను జలవనరుల శాఖ తవ్వించాల్సిన అవసరం ఉంది. అయితే గతంలో కాల్వల మరమ్మతులకు ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ గ్రాంటు, ఎంఆర్ గ్రాంటు ప్రభుత్వం మంజూరు చేసేది. గత పదేళ్లుగా ఆ గ్రాంట్లు విడుదల కావటం లేదు. దీంతో పంట కాల్వల నిర్వహణకు జలవనరుల శాఖ వద్ద నిధుల కొరత ఏర్పడింది. కనీసం గుర్రపు డెక్క తొలగింపునకు కూడా నిధులు కరువయ్యాయి. పూడుకుపోయిన బ్రాంచి కాల్వలతోపాటు ప్రధాన కాల్వలను కూడా తవ్వటం లేదు. ప్రతి కాల్వ శివారు భూములకు సాగునీరందక వరి పొలాలకు సార్వా సీజన్‌లో సైతం ఆయిల్ ఇంజన్లతో నీరు తోడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరితోపాటు ప్రస్తుతం అపరాల పైర్లు కూడా నీరందక ఎండిపోతున్నాయి. ప్రధాన కాల్వల నుంచి బ్రాంచి కాల్వల ద్వారా పొలాలకు నీరందేలా కనిపించటం లేదు.

శివారు ప్రాంతానికి చేరని తాగునీరు..

కైకలూరు: గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉన్నప్పటికి పంటకాలువలు అధ్వానస్థితిలో ఉండడంతో ఎగువ నుంచి నీరు విడుదల చేసినా శివారు ప్రాంతాలకు చేరే పరిస్థితి లేదని జలవనరుల శాఖ నిద్రావస్థలో ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా పంట కాలువల్లో గుర్రపుడెక్క, తూడు, నాచు, ఇరువైపులా చెట్లు కాలువల్లోకి ఒరిగి నీటి ప్రవాహానికి అవరోధంగా మారాయి. అధికారులు కాలువల్లోని చెత్తను తొలగించకపోతే శివారు గ్రామాలకు తాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుంది. వేసవిలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే కైకలూరు మండలంలో 15 గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుర్తించారు. కాలువల ద్వారా అరకొర నీరు వస్తున్నా శివారు ప్రాంతాలకు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కైకలూరులో ప్రధానంగా 35 ఎకరాల మంచినీటి చెరువు ఉన్నప్పటికీ వాటిలో కూడా నీరు రోజురోజుకు తగ్గుతోంది. అటపాకలో మంచినీటి చెరువు అడుగంటడంతో నీటి సరఫరాను నిలిపి వేశారు. దీంతో ప్రజలు ఊటబావులు, బోర్లను ఆశ్రయిస్తున్నారు. తాగేందుకు నీటిని కైకలూరులోని ప్రైవేటు ఆర్వో ప్లాంట్లలో కొనుగోలు చేస్తున్నారు. కాలువలకు నీరు విడుదలపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం ఏ సమయంలో నీరు వచ్చినా కాలువలు అధ్వానంగా ఉండడంతో గ్రామాలకు తాగునీరు చేరే పరిస్థితి లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇదిలా ఉండగా మండలంలో 1400 ఎకరాల్లో రెండో పంటగా మినుము పంటను రైతులు వేశారు. ఆరుతడికి నీరు అందకపోవడంతో మొక్క పసుపు రంగులోకి మారిపోవడమే గాక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నా కాలువలను అధికారులు, ప్రభుత్వాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలే అసలు కారణం..

మండవల్లి: మండలంలో పంట కాలువలు అధ్వాన స్థితికి చేరాయి. మురుగు కాలువల కంటే దారుణంగా తయారయ్యాయి. పంటకాలువలు పట్టించుకున్న నాథులే కరువయ్యారు. దీంతో చెత్తాచెదారాలతో పంటకాలువల రూపురేఖలే మారిపోయాయి. అంతేకాకుండా పంటకాలువల సమీపంలో ఆక్రమణ పెరిగిపోవడంతో కాలువ కుంచించుకుపోతోంది. మండవల్లి మండలంలోని పంట కాలువల పరిస్థితి ఒకటి కాదు రెండు కాదు ఎక్కడా చూసినా అంతే. దీంతో దిగువ గ్రామాలకు మంచినీరు సరఫరా చేయవలసిన ఈ కాలువలు వట్టిపోయాయి. మండలం నుంచి మూడు తాళ్లపాడు వరకు మంచినీరు సరఫరా చేసే పంటకాలువ దుస్థితి మాటల్లో చెప్పలేం. పోల్‌రాజ్ కెనాల్ నుంచి కొర్లపాడు ఛానెల్ ద్వారా మండవల్లి మంచినీటి చెరువుకు నీరు సరఫరా కావాల్సి ఉంది. అయితే కాలవ అభివృద్ధికి నోచుకోక నీరు విడుదల చేసినప్పటికీ నామమాత్రపు నీరు దిగువకు చేరుతోంది. దీంతో అష్టకష్టాలు మీద మంచినీటి సమస్య గట్టెక్కుతుంది. మండవల్లి మంచినీటి చెరువు నుంచి సుమారు మూడు కిలోమీటర్లు మేర కాలువలో నీరు ప్రవహించి మూడు తాళ్లపాడు గ్రామానికి మంచినీరు సరఫరా కావాల్సి ఉంది. ఈ మూడు కిలోమీటర్లు దూరంలో ఒక కిలోమీటర్ దూరం గృహాల పక్క నుంచి కాలువ ప్రవహించవలసి ఉంది. గృహ నిర్మాణంలో కాలువను ఆక్రమించేయడంతో కాలువ కాస్తా బోదెగా మారింది. ఈ కాలువ కింద చేపలు, రొయ్యలు చెరువులతో పాటు వ్యవసాయం ఉన్నప్పటికీ దిగువకు నీరు చేరడం అతి కష్టమనే చెప్పాలి. గతేడాది జూన్, జులై నెలలో కాలువలు వచ్చినప్పుడు నేటికి మూడు తాళ్లపాడు వైపు పంటకాలువ మంచినీరు చూడలేదంటే అతిశయోక్తి కాదు. దీనికి తోడు కాలువలో చెత్తా, తూడు దట్టంగా పేరుకుపోయింది. ఇటీవల ఇరిగేషన్ అధికారులు తూడు ముందు స్ప్రే మొక్కుబడిగానే చేయించడంతో దట్టంగా పెరిగిపోయింది. ఎగువ నుంచి కొద్దిపాటి నీరు వచ్చినప్పటికీ కాలువలు అభివృద్ధికి నోచుకోకపోవడం వల్ల ఆ నీరు అందడం లేదు. అధికార యంత్రాంగం కూడా కాలువలో దుస్థితిని పట్టించుకోకపోవడం, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడకపోవడం దిగువకు చుక్క నీరు వచ్చిన పాపాన పోలేదు. గత ప్రభుత్వ పాలనలో సాగునీటి సంఘాలు అమలులో ఉండడంతో కాలువలు అభివృద్ధికి శ్రీకారం చుట్టేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో వాటిని రద్దు చేయడం వల్ల కాలువలను పట్టించుకున్న నాథుడే లేడు. క్రమేపి కాలువలు రూపురేఖలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని చెప్పక తప్పదు.


గుర్వాయిపాలెం-పెదలంక కాల్వలో దట్టంగా పేరుకున్న డెక్క, తూడు

తూడుతో నిండిన పంట కాల్వలు

కలిదిండి: మండలంలో గుర్వాయిపాలెం-భాస్కరరావుపేట, మూల్లంక-పెదలంక, కొండంగి పంటకాల్వలు డెక్క, తూడు, చెత్తతో పూడుకుపోయాయి. దీంతో సాగు, తాగునీటి కొరత ఏర్ప డింది. అడుగంటిన తాగునీటి చెరువులను నింపటానికి అవస్థలు పడుతున్నారు. ఎత్తిపోతల నుంచి వచ్చే సాగునీరు సరఫరా కాక ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



తాగునీటి వంతివ్వకుంటే ఆమరణ దీక్ష : సర్పంచ్

కలిదిండి: వెంకటాపురంలో అడుగంటిన తాగునీటి చెరువును నింపటానికి నీటివంతు ఇవ్వాలని ఆదివారం సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు ఎండిన పోతుమర్రు కాల్వలో బైఠాయించి నిరసన తెలిపారు. వంతు ఇస్తున్నామని అధికారులు చెప్పటంతో కాల్వను బాగు చేశామని, ఇంత వరకు కాల్వకు నీటి వంతు ఇవ్వకపోవటంతో కాల్వ కూడా ఎండిపోయిందన్నారు. వారం రోజుల్లో చెరువు పూర్తిగా ఎండిపోయి తాగునీటి కోసం ఇబ్బంది పడే ప్రమాదం ఉందని సంబంధిత అధికారులు స్పందించి వెంకటాపురానికి తాగునీటి వంతు ఇస్తే యుద్ధ ప్రాతిపదికన గ్రామస్థుల సహకారంతో చెరువు నింపుకుంటామన్నారు. వంతు ఇవ్వకపోతే ఆమరణ దీక్ష చేపడతామని తెలిపారు.

పూడిక తీయాలి



ముదినేపల్లి: పంట కాల్వల్లో పూడికలను తరచూ తీస్తుండాలి. సార్వాకు ముందు కాల్వల్లో గుర్రపు డెక్కను నిర్మూ లించే పనులు జరగక శివారు భూములకు నీరందటం లేదు. కాల్వల నిర్వహణను మెరుగుపర్చాలి.

-బండారు పాండు, రైతు ఉప్పరగూడెం


కేంద్ర పథకాల క్యాలెండర్‌ను వివరిస్తున్న గోగినేని

నూజివీడు మండలంలో పల్లెకు పోదాం

నూజివీడు, ఫిబ్రవరి 11: నూజివీడు మండలంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని బీజేపీ నూజివీడు మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాసకుమార్ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. నూజివీడు మండల పరిధిలోని యనమదల, బత్తులవారిగూడెం, సుంకొల్లు గ్రామాల్లో సమస్యలను తెలుసుకున్నారు. శక్తి కేంద్రాలకు పోలింగ్ బూత్ కమిటీలను అనుసంధానం చేస్తూ బీజేపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు. మండల ప్రవాస్ కన్వీనర్ దారావతు శంకరం, పార్టీ మండల ఉపాధ్యక్షుడు యనమదల కృష్ణారావు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో ముదినేపల్లి మండలంలో ఆదివారం పల్లెకు పోదాం కార్యక్రమం ప్రారంభమైంది. పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో ముదినేపల్లి, పెయ్యేరు తదితర గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కోటప్రోలు కృష్ణారావు పాల్గొని కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేశారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రధాని కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. పార్టీ నాయకులు వత్తుమిల్లి ప్రసాద్, మొవ్వ ఫణీంద్ర కుమార్, కొల్లిపర నాగరాజు, రెడ్డి నాగలక్ష్మి, తాతారావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంపై మాట తప్పిన ప్రభుత్వం

చింతలపూడి, ఫిబ్రవరి 11: పాఠ శాలల విలీనం ద్వారా ఒక్క పాఠశాల కూడా మూతపడదని సీఎం జగన్, మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారని, రాష్ట్రంలో 118 పాఠశాలలు మూతపడ్డాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శామ్యూల్ తెలి పారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శామ్యూల్ దంపతులను మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వేల సంఖ్యలో ఎస్‌జీటీ పోస్టులు రద్దయ్యాయన్నారు. 117 జీవోను తక్షణం రద్దు చేయాలన్నారు. దీని ద్వారా పాఠశాలల విలీనం నిలిపివేయాలన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ వచ్చినందున తక్షణం ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని కోరారు. నాలుగేళ్లుగా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 11 పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీకి సాల్మన్‌రాజు, రంగావలి ఎన్నిక

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 : ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఏలూరుకు చెందిన బీ.ఏ.సాల్మన్‌రాజు, ఆడిట్‌కమిటీ సభ్యునిగా ఎస్.కె.రంగావలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర ఆదివారం తెలిపారు. విజయవాడలో జరిగిన ఎన్నికల్లో వారు ఎన్నికయ్యారన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వారు మరింత కృషిచేయాలని ఆకాంక్షించారు.


అనివేటి మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

కొల్లేరు ప్రజల కోసం వారధి నిర్మాణం

కైకలూరు, ఫిబ్రవరి 11: కొల్లేరు ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వారధి నిర్మాణం చేపట్టినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం గ్రామంలో సర్కారు కాలువపై నిర్మించిన శ్రీపెద్దింటి అమ్మవారి వారధిని, అమ్మవారి ఆలయ అనివేటి మండపాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా వంతెన నిర్మించాలనే కల సాకారమైందన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, జడ్పీటీసీ కురేళ్ళ బేబి, ఆలయ చైర్మన్ పులవర్తి లక్ష్మణ్, ఆలయ అధికారి కెవి గోపాలరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వాగ్విదిని అలంకరణలో శ్రీశ్యామలాంబ

కైకలూరు, ఫిబ్రవరి 11: కైకలూరు శ్రీ శ్యామలాంబ అమ్మవారు శ్యామలా నవరాత్రుల సందర్భంగా రెండో రోజు వాగ్విదిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. రామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ బూరుబోయిన రామ్మోహనరావు దంపతులు పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాన్ని ఆలయ చైర్మన్ గుర్రం రాంబాబు, ఈవో వీఎస్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు. సోమవారం అమ్మవారు నకుల శ్యామలాగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.



వైష్ణవికి పురస్కారం

ముదినేపల్లి, ఫిబ్రవరి 11 : అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని ముదినేపల్లికి చెందిన అంబుల వైష్ణవికి హైదరాబాద్ విశ్వగురు వరల్డ్ రికార్డు ఆర్గనైజేషన్ ప్రతిష్టాత్మక కామధేను పురస్కారాన్ని అందజేసింది. ఆదివారం హైదరాబాద్‌లో ఆర్గనైజేషన్ చైర్మన్ సత్యవోలు రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పేదల పట్ల దాతృత్వం చూపించే వారికి ఇచ్చే కామధేను అవార్డును 2024 సంవత్సరానికి వైష్ణవికి అందజేశారు. తెలంగాణా హైకోర్టు జడ్జి జస్టిస్ ఎల్.వి.వేణుగోపాల్ అవార్డును వైష్ణవికి అందజేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.లక్ష్మీకాంతం, ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఎంఆర్ఎస్ రాజు, పొన్నూరు మదన్ మోహన్ తదితరులు వైష్ణవిని అభినందించారు.


మినుము పైరును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

అసమర్థ ప్రభుత్వంపై పోరాడాలి

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 11: సాగు, తాగునీరు సరఫరా చేయలేని అసమర్థ ప్రభుత్వంపై రైతులు పోరాడాలని, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చలసాని జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెనుమల్లి, సంఘర్షణపురం గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలకు తాగునీరు, రైతులకు ఆరుతడి పంటలకు సాగునీరు ఇవ్వడం లేదని మండి పడ్డారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు నీరులేక మినప పైరు ఎండిపోతోందని పలువురు రైతులు టీడీపీ నాయకులకు విన్నవించారు. ఆయన వెంట పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ, అడుసుమిల్లి రామకృష్ణ, సరవయ్య తదితరులు ఉన్నారు.



తామరకొల్లులో సందడి చేస్తున్న జబర్దస్త్ కళాకారులు (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న అనంత శ్రీరామ్

అలరించిన జబర్దస్త్ కళాకారులు

కైకలూరు, ఫిబ్రవరి 11: మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీనే తీసుకు రావడం అవసరమని సినీ గేయ రచయత అనంత శ్రీరామ్ అన్నారు. ఆదివారం కైకలూరు మండలంలోని భుజబలపట్నం, వరహాపట్నం, తామరకొల్లు గ్రామాల్లో జబర్దస్త్ కళాకారుల టీం, సినీ గాయకుల బృందం బీజేపీ పథకాలపై ప్రచారాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా గేయ రచయత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి చౌదరి చేసిన సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. జబర్దస్త్ కళాకా రులు అదిరే అభి, అప్పారావు, బాబి, వినోదిని, ఇమ్మానియేలు నిర్వహించిన కామెడీ షోలు ప్రజలను అలరించాయి. సినీ గాయకులు లాస్యప్రియ, అరుణ్ కౌండిన్య తమ పాటలతో శ్రోతలకు వీనులవిందు చేశారు. బీజేపీ మండల అధ్యక్షులు కట్టా వీరరాఘవులు, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు కీర్తి రాంప్ర సాద్, పార్టీ నాయకులు పెరుగు సత్యనారాయణ, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఎంపిక

నూజివీడు, ఫిబ్రవరి 11: త్రిపుర రాష్ట్రంలోని అగర్తలలో ఫిబ్రవరి 18 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్ యోగాసన పోటీలకు ఏపీ జట్టుకు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు ఎంపికైనట్టు ఆర్జీయూకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థులు కె.లక్ష్మణరావు, ఆర్. శేషసురేష్, పి.ఆదిశంకర్ రెడ్డి, టి.అశోక్, పి.సాయిసురేష్, పి.భరత్‌కుమార్ ఎన్నికయ్యారని వివరించారు. విద్యార్థులను, కోచ్ అక్కినేని సత్యశ్రీధర్‌ను ప్రొఫెసర్ గోపాలరాజు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ రత్నాకర్, శ్రావణి, చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.


సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

మాజీ న్యాయమూర్తి గోపాల గౌడకు సత్కారం

ముసునూరు, ఫిబ్రవరి 11: విజయవాడలో జరిగిన మహా స్వాప్నికుడు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆదివారం ముసునూరు మండలం చెక్కపల్లి టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాల గౌడను టీడీపీ నాయకులు చిలుకూరి వెంకటేశ్వరరావు, కూచిపూడి దేవేంద్ర, మాదల వెంకటేశ్వరరావు, కాటేపల్లి నాగేశ్వరరావు మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

జనసేనలో పలువురి చేరిక



ముసునూరు, ఫిబ్రవరి 11: కాట్రేనిపాడులో నిర్మించిన జనసేన పార్టీ జెండా దిమ్మెను నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆదివారం ఆవిష్కరించారు. తొలుత జనసేన నాయకులు, కార్యకర్తలు గ్రామంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫణిబాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేలా ప్రతి జనసైనికుడు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలకు ఆకర్షితులైన వైసీపీ యువత 50 మంది జనసేనలో చేరగా వీరికి ఫణిబాబు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. జనసేన నాయకులు పాశం నాగబాబు, సందీప్, వినయ్, నాగలక్ష్మి, టీడీపీ నాయకులు కందుల పిచ్చియ్య, మామిడిశెట్టి గిరిబాబు, రాపర్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో లిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రతిభ



ముదినేపల్లి, ఫిబ్రవరి 11 : హైదరాబాద్‌లోని విశ్వం ఎడ్యుటెక్ సంస్థ ఆదివారం విజయవాడలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో ముదినేపల్లి లిటిల్ ఫ్లవర్ స్కూలు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ పాఠశాలకు చెందిన పిండి మోక్షజ్ఞ ప్రథమ, బెజవాడ నవీన్ తృతీయ, ఈడే కార్తికేయ ప్రత్యేక బహుమతి సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ బలుసు రఘురామయ్య తెలిపారు. విజేతలను స్కూలు యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

ముదినేపల్లి, ఫిబ్రవరి 11 : వైఎస్ఆర్ ఆసరా పథకం కింద ముదినేపల్లి మండలానికి నాల్గవ విడతగా 1258 స్వయం సహాయక సంఘాలకు రూ.11.82 కోట్లు మంజూరైనట్లు వెలుగు ఏపీఎం టి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులను అందజేస్తామన్నారు. మండలంలో నాలుగు విడతలుగా రూ.47.1 కోట్ల ఆసరా నిధులు మంజూరైనట్లు ఏపీఎం తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం

మండవల్లి, ఫిబ్రవరి 11: మండవల్లి జడ్పీ హైస్కూలులో 2003-04 సంవత్సరానికి చెందిన టెన్త్ బ్యాచ్ విద్యార్థులు 20 సంవత్సరాలు అనంతరం ఆదివారం తాము చదివిన పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులు ఎంఎస్ఎస్ కుమార్, జానకి రామారావు, కొండయ్య, పి. వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ, పీఈటీ విజయ్, రామారావు, రత్నకుమారి, సుబ్రహ్మణ్యం, నజీరున్నీసా బేగం, కరుణ, మహాలక్ష్మిని సత్కరించారు. చనిపోయిన గురువులకు, విద్యార్థులకు నివాళులర్పించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహణకు చొరవ చూపిన గుడివాడ గణేష్, చొప్పరపు విజయ్, గోనుగుంట మోహనరంగ, డి. కుసుమకుమార్, జి. సతీష్ కె. వెంకటేశ్వరరావు తదితరులను పూర్వ విద్యార్థులంతా అభినందించారు.



మండవల్లి హైస్కూల్లో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు